హైదరాబాద్ వార్త



# కొండెక్కిన చికెన్ ధరలు

### కిలోచికెన్ ధర రూ.314



హైదరాబాద్, జూన్ 10,ప్రభాతవార్త: నాన్‌వెజ్ ప్రియులకు షాక్ తగిలినంత పనవుతుంది. చికెన్ ధర కొండెక్కి ..నాన్‌వెజ్ ధరలు భారంగా మారుతున్నాయి. పెరిగిన చికెన్ ధరలు చూస్తుంటే నాన్‌వెజ్ ప్రియులు హడలెత్తిపోతున్నారు. డిమాండ్‌కు సరఫరా లేకపోవడం వల్ల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఫాంల వద్ద బర్డ్స్(కోళ్లు) లేకపోవడంతో ధరలు పెంచేస్తున్నారు.సాధారణ రోజుల్లో జంటనగరాల్లో రోజుకు దాదాపు 600 నుంచి 750 టన్నులకు పైగా చికెన్ వినియోగం అవుతున్నట్లు వ్యాపారులు తెలుపుతున్నారు. ఇక ఆదివారం, పండుగ దినాల్లో ఇది మరింత ఎక్కువగా ఉంటుందని తెలుపుతున్నారు. కానీ ఇటీవల ఎండల ప్రభావతంతో వేడిని తట్టుకోలేక ఫామ్‌ల్లోని కోళ్లు మృత్యువాత పడ్డాయన్నారు. దీంతో కొంతమేర కొరత ఏర్పడిందని చెబుతున్నారు. శివారు ప్రాంతాల్లో దాదాపు 80కోళ్లఫారాలు ఉన్నాయి. జంటనగరాల్లో దాదాపు 10వేలకు పైగా చికెన్ వ్యాపారులు ఉన్నారు. సాధారణ రోజుల్లో ఒక్కో వ్యాపారి రోజుకు 700నుంచి 1600కేజీల చికెన్ అమ్మకాలు చేస్తున్నారు. రెండు నెలలక్రితం కిలో 150 పలికిన చికెన్ ధర ప్రస్తుతం గతనెల రోజు నుంచి 200 లనుంచి 230 వరకు పలికింది.కానీ ప్రస్తుతం ఒక్కసారిగా పెరిగి 314కి చేరింది. శనివారం స్కిన్‌తో కలిపి అమ్మే చికెన్ కిలో 290 ఉండగా ప్రస్తుతం.లైవ్‌బర్డ్ (కోడి) అయితే కిలో 200రూపాయలు పలుకుతోంది. నాటుకోడి కెజీ 550గా ఉంది. ఇలా ఒకపక్క హోటళ్లు, మరోపక్క రకరకాల ఫంక్షన్లకు అవసరమైన చికెన్‌ను కొనుగోలు చేస్తున్నారు. దీంతో సామాన్య ప్రజలు చికెన్ కొనుగోలు చేయాలంటే చాలాచోట్ల స్టాక్ లేకపోవడం ఉన న్నచోట ధరలు పెంచి అమ్మడం చేస్తున్నారు. దీంతో మాంసం ప్రియులు కిలో కొనుగోలు చేసేవారు అరకిలోతో సరిపెట్టుకోవాల్సి న పరిస్థితి నెలకొంది.

# మరో ఐదు రోజులు ఇంతే

**మధ్యాహ్నం 12 నుండి 3 గంటల మధ్య బయటకు రాకూడదు.. దాహం వేయకపోయినా వీలైనప్పుడల్లా నీరు తాగాలి**



హైదరాబాద్, జూన్ 10 ప్రభాతవార్త : భానుడు భగభగమంటూ తన ప్రతాపాన్ని చూపించాడు. బయటికి వెళ్లాలంటేనే భయపడేలా ఎండలు ఠారెత్తిస్తున్నాయి. వేడి గాలులు, ఉక్కపోతలు, అధిక వేడితో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. అధిక ఎండలు కారణంగా రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. తీవ్రమైన ఉష్ణోగ్రతలు, వడగాల్పుల సమయంలో ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. దాహం వేయకపోయినా వీలైనప్పుడల్లా తగినంత నీరు తాగాలని పేర్కొంది. దాహం వేసినంత వరకు వేచిచూడడం మంచి సూచిక కాదని తెలిపింది. పార్క్ చేసిన వాహనాల్లో పిల్లలను లేదా పెంపుడు జంతువులను వదిలి వెళ్లవద్దని, వాహనం లోపల ఉష్ణోగ్రత ప్రమాదకరంగా మారవచ్చని హెచ్చరించింది. బయటకు వెళ్లేటప్పుడు తాగునీటిని వెంట తీసుకువెళ్ళాలి. ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ (ఓఆర్ఎస్) వినియోగించాలి. నిమ్మరసం, మజ్జిగ, లస్సీ వంటి ఇంట్లో తయారు చేసిన పానీయాలు, ఉప్పు కలిపిన పండ్ల రసాయనాలను తీసుకోవాలి. పుచ్చ, కర్బూజ, ఆరెంజ్, ద్రాక్ష వంటి అధిక నీటి కంటెంట్ ఉన్న సీజనల్ పండ్లు, కూరగాయలను తినాలి. అలాడే పైనాపిల్, దోసకాయ, పాలకూర లేదా ఇతర స్థానింగా లభించే పండ్లు, కూరగాయలు తినాలని సూచించింది. సన్నని వదులుగా ఉండే కాటన్ వస్త్రాలనఉ ధరించడం మంచిది. గొడుగు, టోపీ, టవల్ వంటి ఇతర సాంప్రదాయ పద్ధతుల్లో తలను ఎండ వేడి నుంచి రక్షించుకోవాలి. ఎండలో బయటకకు వెళ్ళేటప్పుడు బూట్లు లేదా చెప్పులు తప్పనిసరిగా ధరించాలని వైద్యులు సూచిస్తున్నారు.

**ఇంకా తీసుకోవాల్సిన జాగ్రత్తలు..** బాగా వెంటిలేషన్ ఉన్న చల్లని ప్రదేశాల్లో ఉండాలి. ప్రత్యక్ష సూర్యకాంతి, వేడి గాలులనఉ నిరోధించాలి. పగటిపూట కిటికీలు, కర్టెన్‌లను మూసి ఉంచాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో మూనమే బటయకు వెళ్లేలా ప్రణాళిక రూపొందించుకోవాలి. అనారోగ్యంతో ఉన్నవారు ఎండాకాలంలో ఇతరులన్నా ఎక్కువ ప్రమాదంలో ఉంటారు. వీరు అదనపు శ్రద్ధ తీసుకోవాలి. మరీ ముఖ్యంగా శిశువులు, చిన్న పిల్లలు, గర్భిణీ స్త్రీలు ఆరు బయట పనిచేసే వ్యక్తులు, మానసిక వానయధి ఉననన వ్యక్తులు, శారీరకంగా అనారోగ్యంతో ఉన్న వ్యక్తులు, గుండె జబ్బులు లేదా అధిక రక్తపోటు ఉన్నవారు జాగ్రత్తలు తీసుకోవాలి. ఒంటరిగా నివసించే వృద్ధులు లేదా అనారోగ్యంతో ఉన్న వారి ఆరోగ్యాన్ని ప్రతి రోజూ పర్యవేక్షించాలి. శరీరాన్ని చల్లబరచడానికి ఫ్యాన్, తడిబట్టలను ఉపయోగించాలి. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల మధ్య బయటకు రావొద్దు. ఒకవేళ వచ్చినా ఎండలో శారీరకమైన కఠినమైన పనులు చేయకూడదు. తీవ్రమైన ఎండ సమయంలో వంట గదిలో వంట చేయకూడదు. ఒకవేళ చేయాల్సి వస్తే వంటిల్లు వెంటిలేషన్‌లో ఉండాలి. వెంటిలేట్ చేయడానికి తలుపులు, కిటికీలను తెరవాలి. అల్కహాల్, టీ, కాఫీ, శీతల పానీయాలు, పెద్ద మొత్తంలో చక్కెరతో కూడిన పానీయాలను తీసుకోకూడదు. ఇవి శరీర ద్రవాన్ని కోల్పోవడానికి లేదా కడుపు తిమ్మిరికి కారణం కావచ్చు. ఆరు బయట పనిచేసే కార్మికుల కోసం పని ప్రదేశంలో చల్లని తాగునీటిని అందుబాటులో ఉంచాలి. ప్రతి 20 నిమిషాలకు ఒక గ్లాసు నీరు తాగాలని వారికి చెప్పాలి. సాధారణ మానవ శరీర ఉష్ణోగ్రత 97.5ని ఫారిన్‌హీట్ నుంచి 98.9ని ఫారీన్ హీట్ ఉండాలి.

## నాకు 63 యేళ్లయినా.. 36లాగా ఫీలవుతా : బాలకృష్ణ



చిన్నారులకు పండ్లు పంపిణీ చేస్తున్న బాలకృష్ణ

హైదరాబాద్, జూన్ 10,ప్రభాతవార్త: నటుడిగా, ఆస్పత్రికి చైర్మన్‌గా ,ఒక ఎమ్మెల్యేగా ఎలా ఉండాలో నాన్న ఎన్టీఆర్‌ను చూసి నేర్చుకున్నానని బాలకృష్ణ తెలిపారు. తన పుట్టినరోజును కౌంట్‌డౌన్‌గా పెట్టుకుంటానన్నారు. తనవయస్సు ను ఎప్పుడూ తిరిగేస్తానని ..ప్రస్తుతం 63ఏండ్లు ఉన్నా కూడా ..36ఏండ్ల వయస్సు గల వ్యక్తిలా ఫీలవుతానని అన్నారు. ఈమేరకు శనివారం తనపుట్టినరోజు సందర్భంగా బసవతారకం ఆసుపత్రిని బాలకృష్ణ సందర్శించారు. రోగులతో మాట్లాడి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈదేశం, ఈసమాజం తనకు ఏమిచ్చిందని అనేకన్నా ..మనం ఏమిచ్చామనే విధంగా ఉండాలని బాలకృష్ణ సూచించారు. మనవంతా నిస్వార్థంగా పనిచేస్దామని ..ఇక ముందు కూడా పేదలకు మెరుగైన వైద్య సేవలు అందింఏందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈకార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఖైరతాబాద్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విస్తృత పర్యటన

హైదరాబాద్, జూన్ 10,ప్రభాతవార్త: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి శనివారం నగరంలోని ఖైరతాబాద్ నియోజకవర్గంలో విస్తృత పర్యటన చేశారు.మొదటగా ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకర్గ పరిధిలోని బంజారాహిల్స్ డివిజన్ ప్రేమ్‌నగర్ కమ్యూనిటీహాల్ ప్రారంభించారు. ఆతర్వాత నాంపల్లి నియోజకవర్గం రెడ్‌హిల్స్ డివిజన్‌లో అంబేద్కర్‌నగర్,కుర్మబస్తీలలో బోర్‌వేల్‌ను ప్రారంభించారు. అనంతరం చింతల్‌బస్తీలో కమ్యూనిటీ భవనానికి భూమి పూజ చేశారు. అనంతరం వీర్‌నగర్‌లో బోర్‌వెల్ ప్రారంభించి అనంతరం అంబేద్కర్ వ్యాలీ క్లబ్ కమ్యూనిటీ హాల్ ప్రారంభించారు. అనంతరం ఖైరతాబాద్‌లో నిర్వహించిన వివిధ మోర్చాల సమావేశానికి హాజరయ్యారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

## ఆనందగల్లీలో రహదారి పనులు పూర్తి చేయాలి



ఆనంద్‌గల్లీలో కొత్త రోడ్డు నిర్మాణం కోసం తవ్విన దృశ్యం

చార్మినార్, జూన్ 10 ప్రభాతవార్త : ఘాన్సీ బజార్ డివిజన్ పరిధిలోని ఆనంద్‌గల్లీలో ఎటువంటి ఆలస్యం చేయకుండ అధికారులు వెంటనే కొత్త రహదారిని నిర్మించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.నిత్యం ఈ రహదారి మీదుగా వేలాది మంది ప్రజలు పలు రకాల పనుల మీద ప్రయాణం చేస్తుంటారు.కాగా ఆనందగల్లీలోని రహదారి చెడి పోవటంతో జిహెచ్ఎంసి అధికారులు పది హేను రోజుల క్రితం కొత్త రోడ్డు నిర్మాణం కోసం పాత రహదారిని తవ్వారు.దీంతో ఈ రహదారి మీదుగా వాహనాల రాక పోకలు పూర్తిగా నిలిచి పోయాయి.స్థానిక ప్రజలు తమ వాహనాలను సైతం వేరే ప్రాంతాలలో పార్కింగ్ చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది.బస్తీ వాసులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు.పది హేను రోజులు కావస్తున్న అధికారులు ఇంత వరకు కొత్త రోడ్డు పనులు చేపట్టక పోవటం పట్ల ఆనంద్‌గల్లీ వాసులు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు.ఘాన్సీ బజార్ వ్యాపార కేంద్రానికి ప్రసిద్ది గాంచటంతో నిత్యం జంట నగరాలకు చెందిన వేలాది మంది వినియోగదారులు ఇక్కడకు వస్తుంటారు. ఆనంద్ గల్లీ నుంచి వెళ్లె రహదారిని మూసి వేశారు.దీంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఘాన్సీ బజార్ డివిజన్‌లోని ఆనందగల్లీలో కొత్త రహదారి పనులు చేపట్టి పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## తెలంగాణ అసెంబ్లీలో దొంగలు, రౌడీలు ఉంటే.. మేధావులు బయట సమాజసేవ చేస్తున్నారు

**రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య**

చిక్కడపల్లి, జూన్ 10,ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో దొంగలు, రౌడీలున్నారని, మేధావులు బయట ఉంటూ సమాజ చేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో విద్యార్థి సంఘాల అఖిలపక్ష సమావేశం సంఘం ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యం, విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలా వెంకటేశ్, టిజేఏసీ చైర్మన్ కోలా జనార్దన్, మాదిగ స్టూడెంట్ యూనియన్ నేత శాంతికుమార్, వేల్పుల సంజయ్(బిఎస్ఎఫ్), కొత్తపల్లి తిరుపతి(ఓయు జేఏసీ), ఆమ్ ఆద్మీ పార్టీ విద్యార్థి నేత పరీక్షన్ రాజ్, క్రాంతి(ఏఐఎస్ఎఫ్)తో పాటు అంబేద్కర్ స్టూడెంట్ యూనియన్, ఎస్సీ,ఎస్టీ, బీసీ స్టూడెంట్ యూనియన్, తెలంగాణ నవనిర్మాణ సమితి, బీసీ యువజన విద్యార్థి సంఘం, జూనియర్ అడ్వకేట్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. విద్యార్థి సంఘాలకు ఎన్నికలు జరిగినప్పుడే నాయకత్వ లక్షణాలు విద్యార్థి దశ నుంచి అలవాటవుతాయని, గతంలో విద్యార్థి నాయకులే నేడు రాజకీయంగా ఉన్నత స్థాయిలో ఉన్నారని, విద్యార్థులను రాజకీయాలకు దూరంగా ఉంచేందుకే ప్రభుత్వాలు విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం లేదని అన్నారు. బలహీనవర్గాలు నాయకత్వ లక్షణాలు ఎక్కడ పెరిగిపోతాయోనని విధంగా సిఎం కెసిఆర్ నాయకత్వంలో కనిపించని కుట్రలకు పాల్పడుతున్నారని, తెగించి పోరాటం చేస్తే తప్ప సమస్యలు సమసిపోయే అవకాశం లేదన్నారు. ఈ విద్యాసం వత్సరం నుంచే కళాశాలలో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, ఆ దిశగా విద్యార్థి సంఘం నాయకులు పనిచేయాలని అన్నారు. బలహీనవర్గాలకు రాజ్యాధికారం దూరం చేసే కుట్ర జరుగుతోందని అన్నారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఆంధ్ర కార్పొరేట్ కళాశాలలకు రాష్ట్రం నుంచి తరిమికొడతామని సిఎం కెసిఆర్ అన్నారని,కాని రాష్ట్రం ఏర్పడ్డాకే ఆయా కళాశాలలో ఫీజులు అధికమయ్యాయని, విద్యావ్యవస్థను ఈ కళాశాలలు భ్రష్టుపటిస్తున్నాయని, లక్షల్లో ఫీజులు వసూళ్ళు చేస్తూ తల్లిదండ్రులను వేధిస్తున్నారని అన్నారు. విద్యాప్రమాణాలను కూడా పాటించడం లేదని, ఆయా కళాశాలల్లో గుర్తింపును రద్దు చేయాలని అన్నారు. సిఎం కెసిఆర్ సిఎం అయిన నాటి నుంచి ఒక్క గురుకుల కళాశాలను నిర్మించలేదని అన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్యం ప్రజలకు అందుబాటులో లేదని, నేడు రాష్ట్రాన్ని 'తాగుబోతుల' రాష్ట్రంగా మార్చేశారని విమర్శించారు.



# తప్పెవరిది..?

నగరంలో ఈ మధ్య జరుగుతున్న హత్యలు ప్రజల్లో తీవ్ర భయాందోళనలు రేపుతున్నాయి. అనవసరంగా అడ్డదారులు తొక్కుతూ తమ జీవితాలను సర్వనాశనం చేసుకుంటున్నారు. కొన్ని పరిచయాలు ప్రేమ పేరుతో వివాహేతర సంబంధాలకు దారితీసి ఎంతో భవిష్యత్తు ఉన్న జీవితాలను అర్థాంతరంగా ముగిస్తున్నాయి. భార్య, భర్తల మధ్య చిన్న విషయాలపై పెద్ద రాద్ధాంతం చేసుకుంటూ చివరికి ప్రాణాలు తీసుకునే ఘటనలు కొన్నైతై.. వివాహమై భార్య పిల్లలతో హాయిగా గడపాల్సి న జీవితాన్ని వివాహేతర సంబంధాలు ఏర్పరుచుకొని.. చివరికి ప్రాణం తీస్తున్నాయి. కొందరి తెగింపులు చూస్తుంటే.. అసలు మానవ జీవితంలో ఉన్నామా అనిపించే.. ఒళ్లు గగుర్పొడిచే ఈ ఘటనలు.. సంఘటనలు ప్రజల్లో అలజడి రేపుతున్నాయి.




సరూర్‌నగర్ వెంకటేశ్వరకాలనీ సంఘటనను తీసుకుంటే.. పూజారి అయి ఉండి.. వివాహమై భార్య పిల్లలు ఉన్న ఒక వ్యక్తి మరో మహిళతో శారీరక సంబంధం ఏర్పరుచుకొని.. పెళ్లి చేసుకోమంటుందని.. నన్ను మానసికంగా ఇబ్బంది పెడుతుందనే సాకుతో అత్యంత దారుణంగా హత్యచేసి జైలుకెళ్లినా.. హత్యకాబడ్డ అప్సర తిరిగివస్తుందా..?

ఈ విషయమై.. పూజారి భార్య మీడియాతో మాట్లాడిన మాటలు వింటుంటే.. భర్త చేసిన తప్పుగొప్పగా ఉన్నట్టనిపిస్తోంది. నా భర్తను ఆమె మానసికంగా వేధిస్తుందని.. పెళ్లి చేసుకోమంటుందని బలవంతం చేసిందని ఆమె చెబుతుంది. ఎంత బలవంతంగా పెళ్లి చేసుకోమని వేధించినా.. తన భర్త ఇంత దారుణానికి ఒడికడతాడా..? అనే ఆశ్చర్యం ఆమె మాటల్లో కనిపించింది. (ప్రభాతవార్త – హైదరాబాద్)

## 22న జరుగనున్న గోల్కొండ బోనాల ఉత్సవాలపై సమీక్ష

**బోనాల ఉత్సవాలకు రూ. 10 లక్షల నిధులు**

**నగరంలో జరిగే బోనాల ఉత్సవాలకు రూ.15 కోట్ల నిధులు మంజూరు**

**మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని

మెహిదీపట్నం, జూన్ 10, ప్రభాతవార్త : మన సంస్కృతికి ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాలను అత్యంత వైభవంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర పశుసంవర్థక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఈనెల 22న గోల్కొండ వద్ద ప్రారంభం కానున్న బోనాల ఉత్సవాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో శనివారం గోల్కొండ కోట వద్ద సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గోల్కొండ బోనాల ఉత్సవాలకు దేశ, విదేశాల నుండి కూడా భక్తులు వస్తారని తెలిపారు. బోనాల ఉత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే లక్షలాది మంది భక్తులను దృష్టిలో పెట్టుకొని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందన్నారు. గోల్కొండ బోనాల ఉత్సవాల నిర్వాహణ కోసం రూ.10 లక్షల నిధులను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాట్లు కోసం సుమారు రూ.10లక్షల నిధులను ఖర్చు చేస్తుందని తెలిపారు. బోనాల ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించాలనే ఉద్దేశంతో వివిధ దేవాలయాలకు ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం రూ.15 కోట్ల రూపాయలు విడుదల చేస్తుందని తెలిపారు. స్తీలలోని దేవాలయాలకు ఆర్థిక సహాయం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ ప్రభుత్వమన్నారు. ఈ సంవత్సరం బోనాల ఉత్సవాలకు ముందే ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు. బోనాల ఉత్సవాల కోసం వచ్చే భక్తుల కోసం అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులకు ఎలాంటి తోపులాటకు గురికాకుండా నియంత్రించేందుకు పటిష్టమైన భారికేడ్‌లను చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్‌శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మలు, జనరేటర్లను, జలమండలి అధికారులు తాగునీటిని అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం 2014వ సంవత్సరం నుంచి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ బోనాల ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్, బీఆర్ఎస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జ ఠాకూర్ జీవన్‌సింగ్. జోనల్ కమిషనర్ రవి కిరణ్, ఆర్డీఓ వెంకటేశ్వర్లు, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రామక్రిష్ణ, అసిస్టెంట్ కమిషనర్ బాలాజీ, ఆలయ ఈఓ శ్రీనివాస్ రాజు, పురావస్తు శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజనీర్ చంద్రకాంత్, గోల్కొండ కోట ఇన్‌చార్జ్ నవీన్, డీఈ శ్రీనివాస్, వెస్ట్ జోన్ డిప్యటీ పోలీస్ కమిషనర్ కిరణ్ కారే, ఆసిఫ్ నగర్ ఏసీపీ శివమారుతీ, ట్రాఫిక్ డీసీపీ అశోక్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు. గోషామహల్ ఏసీపీ కోటేశ్వర్‌రావు, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## లక్షలాది మంది మాలల హక్కుల సాధన కోసం ఆగస్టు 13న 'మాలల యుద్ధభేరి'

**మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య**



సమావేశంలో మాట్లాడుతున్న జి.చెన్నయ్య

సైఫాబాద్, జూన్ 10 ప్రభాతవార్త: తెలుగు రాష్ట్రాల్లోని లక్షలాది మంది మాలల హక్కులసాధన కోసం, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో మాలలకు తగిన ప్రాతినిధ్యం కోసం ఆగస్టు 13న ఛలో హైదరాబాద్ నగరం పేరిట పెద్ద ఎత్తున 'మాలల యుద్ధభేరి' ఆందోళన కార్యక్రమాన్ని చేపడుతున్నామని మాల మహానాడు జాతీయ జాతీయ అధ్యక్షుడు, మాల ప్రజా సంఘాల జెఎసి చైర్మన్ జి.చెన్నయ్య తెలిపారు. హైదరాబాద్ నగరంలో మాల సామాజిక వర్గానికి ఆత్మ గౌరవ భవనాన్ని నిర్మించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 5 ఎకరాల భూమిని కేటాయించి, తగినన్ని నిధులను విడుదల చేసి భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. శనివారం మాల మహానాడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జి.చెన్నయ్య మాట్లాడుతూ దళిత బంధు రెండో విడతలో మాల, మాల ఉపకులాలకు 50 శాతం యూనిట్లను కేటాయించాలని, వచ్చే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు మాలలకు 10 ఎమ్మెల్యే సీట్లు, రెండు లోక్‌సభ సీట్లు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో మాల మహానాడు నాయకులు జి.చెన్నయ్య, బూర్గుల వెంకటేశ్వర్లు, కరణం కిషన్, డా.మంచల లింగస్వామి, మన్నె శ్రీధర్, అంజలికుమారి, పుణ్యభానుప్రకాష్, రమేష్, ఇందిరా గోకుల, కళ్యాణ్, రామాంజనేయులు, భాను ప్రకాష్, ఇందిరా గోకుల పాల్గొన్నారు.

## సినీ నిర్మాత ఇంటి ముందు పార్కు చేసిన కారు అద్దాలు ధ్వంసం

యూసుఫ్‌గూడ, జూన్ 10, ప్రభాతవార్త : ప్రముఖ సినీ నిర్మాత బెల్లంకొండ సురేష్ ఇంటి ముందు పార్కు చేసిన కారు అద్దాలను ధ్వంసం చేసిన దుండగులు, కారు డిక్కీలో నుంచి ఖరీదైన విదేశీ మద్యం బాటిళ్ళతో పాటు నగదును ఎత్తుకెళ్ళారు. ఈసంఘటన జూబ్లి హిల్స్ పోలీస్ స్టేషన్ పరిదిలో చోటు చేసుకుంది. జూబ్లిహిల్స్ లోని జర్నలిస్ట్ కాలనీలో నివాసం ఉంటున్న సిని నిర్మాత బెల్లంకొండ సురేష్‌కు చెందిన మెర్సిటీస్ బెంజ్ కారును ఇంటి ఎదురుగా రోడ్డుపై పార్కు చేశారు. ఈకారు అద్దాన్ని ధ్వంసం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు కారు డిక్కీలో నుంచి రూ.50వేల నగదు, 11రాయల్ సెల్యూట్ మద్యం బాటిళ్ళను ఎత్తుకెళ్ళారు. ఈవిషయాన్ని గమనించిన బెల్లంకొండ సురేష్ కుటుంబ సభ్యులు డయల్ 100కు ఫోన్ చేయగా జూబ్లిహిల్స్ క్రైమ్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాటిళ్ళ విలువ సుమారు రూ.3లక్షలు ఉంటుందని తెలి సింది. జూబ్లిహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తు న్నారు. ఈక్రమంలో సమీపంలోని సిసి పోటీజీలను పోలీసులు పరిశీలి స్తున్నారు. ఇదిలా ఉండగా కారు డిక్కీలో మద్యం బాటిల్‌లు ఉన్నయన్న విషయం తెలిసిన వ్యక్తులే ఈచోరీకి పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

## చేప ప్రసాదం పంపిణీ విజయవంతంపై అభినందనలు తెలిపిన మంత్రి

గోషామహల్, జూన్ 10 ప్రభాతవార్త: చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమాన్ని అన్ని విభాగాల సహాకారంతో ప్రశాంతంగా,విజయవంతంగా నిర్వహించడం పట్ల తెలంగాణ రాష్ట్ర పశుసంవర్దక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు.నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో గత రెండు రోజులుగా నిర్వహించిన చేప ప్రసాదం కోసం వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రతి ఒక్కరికి చేప ప్రసాదం పంపిణి చేసిన బత్తిని హరినాథ్‌గౌడ్,వారి కుటుంబ సభ్యులకు,వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి ఉచితంగా ఆల్పహారం,భోజనం అందించిన స్వచ్ఛంద సంస్థలు,స్వచ్చందంగా సేవలు అందించిన వాలంటీర్లతోపాటు జిహెచ్ఎంసి,పోలీసు, ట్రాఫిక్,విద్యుత్,జలమండలి,హెల్త్,శానిటేషన్, ఫైర్,మత్స్య,ఆర్అండ్‌బి తదితర శాఖల అధికారులతోపాటు ఎగ్జిబిషన్ సొసైటి సభ్యులకు, ప్రింట్,ఎలక్ట్రానిక్స్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## బురఖా ధరించి ఆటో నడిపిన మహిళా ఆటో డ్రైవర్



హైదరాబాద్, జూన్ 10 ప్రభాతవార్త : ఈ టెక్నాలజీ యుగంలో మహిళలు కూడా పురుషులతో సమానంగా పనులు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. తాము కూడా మగవాళ్లకు ఏమాత్రం తక్కువ కాదని నిరూపిస్తున్నారు. అందులో భాగంగా నగరంలో రద్దీగా ఉండే వీధుల్లో బురఖా ధరించిన ఓ మహిళ ఎలక్ట్రిక్ ఆటో నడుపుతూ కనిపించింది. ఈ అరుదైన సన్నివేశం చోటుచేసుకుంది వేరే ఏ దేశంలోనే, రాష్ట్రంలోనో కాదు. మన హైదరాబాద్‌లో పురుషాధిక్య వృత్తిలో శిక్షణ పొందిన ఈ మహిళా ఆటోరిక్షా డ్రైవర్ పేరు ఆసియా బేగం. హైదరాబాద్‌లో నివసిస్తోన్న ఆమె..ముఖానికి బుర్ఖా ధరించి ఎలక్ట్రిక్ ఆటోరిక్షాను నడుపుతోంది. అత్యంత రద్దీగా ఉండే ట్రాఫిక్‌లో ఆసియా బేగం ఆటోను నడుపుతోన్న దృశ్యాలను ఓ వ్యక్తి చిత్రీకరించి సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ వీడియోలో ఆమె ఆటో నడుపుతూ కనిపించింది. తనను రికార్డు చేస్తున్నారని తెలుసుకున్న ఆసియా..వీడియో వైపు చూడడం ఈ వీడియోలో కనిపిస్తోంది. ఇది ప్రస్తుతం వైరల్‌గా మారింది.



6వ వార్డు ఆనంద్ నగర్‌లో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న మర్రి రాజశేఖర్ రెడ్డి, పాండు యాదవ్ తదితరులు

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : మర్రి రాజశేఖర్ రెడ్డి

కంటోన్మెంట్, జూన్ 10 ప్రభాతవార్త: కంటోన్మెంట్ 6వ వార్డులోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని మల్కాజిగిరి పార్లమెంట్, కంటోన్మెంట్ అసెంబ్లీ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. శనివారం 6వ వార్డులోని ఆనంద్ నగర్, అమర్ జ్యోతి నగర్ పరిసర ప్రాంతాల్లో మాజీ బోర్డు సభ్యుడు పాండు యాదవ్‌తో కలిసి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నాలా, తాగునీరు, రోడ్లు వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి మధుకర్, ప్రవీణ్ యాదవ్, వీరేశ్, శివ, అనిత, సాయి తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగులకు ఆశాజ్యోతి సిఎం కెసిఆర్

**ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్**



కెసిఆర్‌కు పాలాభిషేకం చేస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి, జూన్ 10 ప్రభాతవార్త: దివ్యాంగులకు ఆశాజ్యోతి సిఎం కెసిఆర్ అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. దివ్యాంగుల ఫించన్‌ను వచ్చే నెల నుంచి రూ.1000 పెంచుతున్నట్లు సిఎం కెసిఆర్ ప్రకటించడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్న రామ్‌నగర్ డివిజన్ చౌరస్తాలో శనివారం బిఆర్ఎస్‌డివిజన్ అధ్యక్షుడు రావులపాటి మోజెస్ ఆధ్వర్యంలో సిఎం కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యేమాట్లాడుతూ అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా సిఎం కెసిఆర్ నాయకత్వంలో ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ యువ నేత ముఠాజైసింహ్, డివిజన్ నేతలు ముదిగొండమురళీ, గోకా నవీన్, గజ్జల సూర్యనారాయణ, రాజు చారి, శ్రావణ్, జ్ఞానేశ్వర్‌గౌడ్, ప్రవీణ్, సునీల్, శ్రావణ్, అమర్, మున్నా, మంజుల, భాగ్యలక్ష్మి, తులసీ, మహేశ్వరి, పూస గోరఖ్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

### స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి

ఎమ్మెల్సీలు రఘోత్తమరావు, రవీంద్రరావు

చిక్కడపల్లి, జూన్ 10 ప్రభాతవార్త: స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు అవుతున్న వారిని గుర్తించి సత్కరించడం మంచి సంప్రదాయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన ప్రముఖ సంఘసేవకులు శ్రావణ్‌కుమార్‌కు అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరై ఎమ్మెల్సీలు కూర రఘోత్తమరెడ్డి, పూల రవీంద్రరావు, తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త, తెలంగాణ సాహిత్యఅకాడమి చైర్మన్ జూలూరీ గౌరీశంకర్ హాజరై సత్కరించారు. ఈ కార్యక్రమంలో చిలుముల బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పురుషోత్తమ భారతి స్వామికి ఘనస్వాగతం



పురుషోత్తమ భారతిస్వామికి అభిమానం చేస్తున్న దేప భాస్కర్‌రెడ్డి

ఎల్.బి.నగర్, జూన్ 10 ప్రభాతవార్త : ఆర్కేపురం డివిజన్ అల్కాపురి కాలనీలోని శ్రీశ్రీశ్రీ శృంగేరీ జగద్గురు శంకరాచార్య మహాసంస్థానం శ్రీశారదా పీఠం శృంగేరీ శంకరమఠంనికీ శ్రీశృగేరీ శివగంగ శారదా మార్గదర్శులు శ్రీ పురుషోత్తమ భారతి మహాస్వామీ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామివారికి పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికి గురు వందనం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారు భక్తులకు ఉపదేశాలు అందించారు. ఈ కార్యక్రమంలో దేప భాస్కర్‌రెడ్డి, ధర్మాధికారి ముదికొండ శంకర్‌శర్మ, బంగారయ్యశర్మ, కేవీ శ్రీనివాస్‌శర్మ, గౌరీభాస్కర్‌శర్మ, సంతోష్‌కుమార్, కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారు.

### కళకు శాస్త్రం, సంప్రదాయం రెండు కళ్లు వంటివి

చిక్కడపల్లి, జూన్ 10 ప్రభాతవార్త: కళకు శాస్త్రం, సంప్రదాయం రెండు కళ్ళువంటివనీ, వాటికి ప్రతిభ, సృజనాత్మకత తోడైతే బంగారానికి అబ్బినట్లే ఉంటుందని రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ ఉపసంచాలకులు జి.వసుంధర అన్నారు. ఈ నాలుగు దండిగా ఉన్న నృత్యగురువులు కళాకృష్ణ ముఖత: నాయికాభినయం నేర్చుకునేందుకు నవ్య నాటక సమితి కల్పిస్తున్న ఈ అవకాశాన్ని నృత్యగురువు, యువకళాకారులు వినియోగించుకోవాలని అన్నారు.



సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో చూమంతర్ మెజిషియన్ల కార్యక్రమంలో పాల్గొన్న పలు రాష్ట్రాలకు చెందిన మెజిషియన్లు

## కూకట్‌పల్లి నియోజక వర్గంలో బీజేపీ గెలుపే లక్ష్యం

**బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి శరణ్**



బోయిన్ పల్లిలో గడప గడపకు బీజేపీ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు వడ్డేపల్లి శరణ్

బేగంపేట జూన్ 10,ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజక వర్గంలో రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళుతున్నట్లు బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి శరణ్ అన్నారు. శనివారం బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి ,సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, ధర్మ, సాధు ప్రతాప్ రెడ్డిలతో కల్సి ఆయన పాదయాత్రలో పాల్గొన్నారు. ఓల్డ్‌బోయిన్ పల్లి డివిజన్ పరిధిలోని హెచ్‌ఐఎల్ పార్కు నుంచి సమతా నగర్ మీదుగా ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శరణ్ మాట్లాడుతూ తెలంగాణా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు రాక, రేషన్ కార్డులు, ఫించన్లు లేక ప్రజలకు సరైన మౌళిక వసతులు కల్పించడంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం, పూర్తి గా విఫలమైందన్నారు. ఈ పాదయాత్ర కార్యక్రమంలో మూసాపేట కార్పొరేటర్ మహేందర్, శ్రీకర్‌రావు, సూర్యారావు, ఓల్డ్‌బోయిన్‌పల్లి కంటెస్టెడ్ కార్పొరేటర్ తిరుపతి యాదవ్, జిల్లా కార్యదర్శి పప్పుపటేల్ డివిజన్ అధ్యక్షుడు సంతోష్ జిల్లా నాయకులు సత్యనారాయణ, బాలాజీనగర్ డివిజన్ సెక్రటరీ లక్ష్మి, సాయి, ఎస్కే చౌదరి పాల్గొన్నారు.

## దివ్యాంగులకు పెన్షన్ పెంచడం హర్షణీయం

**బిఆర్ఎస్ అంబర్‌పేట్ ఇంచార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డి**



కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎడ్ల సుధాకర్‌రెడ్డి, పులిజగన్, విజితారెడ్డి తదితరులు

హైదరాబాద్, జూన్ 10, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ దివ్యాంగులకు వెయ్యి రూపాయలు పెన్షన్ పెంచడంపై సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా అంబర్‌పేట్ నియోజకవర్గ ఇంచార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డి కార్యాలయంలో సిఎం కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా ఎడ్ల సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత దివ్యాంగులకు ముఖ్యమంత్రి కెసిఆర్ పెద్దపీట వేశారని మూడువేల పదహారు రూపాయల పెన్షన్ నాలుగు వేల పదహారు రూపాయలు చేయడం సంతోషకరమన్నారు రాబోయే ఎన్నికల్లో మూడోసారి ముఖ్యమంత్రి కెసిఆర్ అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో అంబర్‌పేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పులిజగన్, రాష్ట్ర మహిళా నాయకురాలు దేవిరెడ్డి విజితారెడ్డి, మాధవరెడ్డి , బి.వి రమణ, దయానంద్, మూసఫ్, ఎం.జనార్ధన్, జెడిరాహుల్ , ఎండీ ఖలేద్, నాగమణి, వెంకటమ్మ, విజయలక్ష్మీ, సూర్యలక్ష్మీ ,సాయిపూర్ణ ,రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

## బిసి బంధుఅమలు చేసేలా ముఖ్యమంత్రిపై ఒత్తిడి తేవాలి

**బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి.ఆర్.కృష్ణయ్య**



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య, బర్కా కృష్ణ, కృష్ణయాదవ్

హైదరాబాద్, జూన్ 10, ప్రభాతవార్త: బిసి మంత్రులు ,శాసనసభ్యులు మౌనం వీడి బిసి బంధుఅమలు చేసేలా ముఖ్యమంత్రిపై ఒత్తిడి తేవాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి.ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం విద్యానగర్‌లో బిసి సేన జాతీయ అధ్యక్షులు బర్కా కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ బిసి కార్పొరేషన్ ,బిసి ఫెడరేషన్‌లకు రాయితీ రుణాల కోసం ఎనిమిది సంవత్సరాల క్రితం ఐదు లక్షల డెబ్బైవేలమంది దరఖాస్తు చేసుకున్నారని వారికి తక్షనమే రాయితీ రుణాలు ఇచ్చి ఉపాధి కల్పించాలన్నారు. లేకుండా రాష్ట్ర వ్యాపనతంగా కలెక్టరేట్‌ల ముట్టడి చేస్తామని హెచ్చరించారు. బిసి మంత్రులు ,శాసనసభ్యులు మౌనం వీడి బిసి బంధుఅమలు చేసేలా ముఖ్యమంత్రిపై ఒత్తిడి తేవాలని సూచించారు. అన్ని పార్టీలకు ఎన్నికలప్పుడే బిసిలు గుర్తుకు వస్తారని ఓటుబ్యాంకు రాజకీయాలకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికలల్లో జనాభా దామాషా ప్రకారం అన్ని పార్టీలు బిసిలకు టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో బిసిసేన రాష్ట్ర అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణయాదవ్, వెంకటేష్ యాదవ్, హేమంత్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కాళోజీ జీవిత చరిత్ర నాటకాల ప్రదర్శన



గొల్ల రామవ్వ నాటకంలో ఒక దృశ్యం

రవీంద్రభారతి, జూన్ 10 ప్రభాతవార్త : మూడువారాలపాటు జరుగుతున్న తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగానే నేటి సుపరిపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ, క్రియేటివ్ థియేటర్ సంయుక్త సమర్పణలో శనివారం రాత్రి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో భారత పూర్వ ప్రధాని పి.వి.నరసింహారావు రచించిన, అజయ్ మంకెనపల్లి బృందంచే ప్రదర్శింపబడిన గొల్ల రామవ్వ, డా. కుమారస్వామి బృందంచే కాళోజీ జీవిత చరిత్ర నాటకాల ప్రదర్శనలు అత్యంత అద్భుతంగా జరిగాయి. రజాకార్ల దౌర్జన్యాలు, దోపిడీ, హింసా పెరిగిపోయిన కాలం... ఎటుచూసినా ప్రజలమీద దాడులు, ఆడవాళ్లమీద అఘాయిత్యాలు, మానభంగాలు చేస్తూ నరరూప రాక్షసులుగా తిరుగుతున్న రజాకార్ల కాలం.... నైజాం ప్రభుత్వం కళ్లుండి కూడా ఏదీ చూడలేని కాలం.... ఆ కాలంలో 70ఏళ్ల గొల్ల రామవ్వ తన మనవరాలు మల్లమ్మతో కలిసి ఉంటూ ఒకానొకరాత్రి తన గుడిసెలోకి రజాకార్లమీద తిరుగుబాటు చేస్తు న్న విప్లవకారుడు రావడం, అపరిచితుడైనా జ్వరంతో ఉన్న అతనికి పరిచర్యలతో చేయూతనిచ్చి కంటికి రెప్పలా చూసుకోవడం, మరికొంత కాలానికి అతడి ఆచూకి తెలుసుకొని గొల్ల రామవ్వ గుడిసెలోకి రజాకార్లు ప్రవేశించడం, పరిస్థితిని ఆమె తన ప్రాణంమీదకు తెచ్చుకొని మరీ తన మనవరాలి జీవితం ఫణంగాపెట్టి ఆ పరిస్థితులను ధీటుగా ఎదుర్కోవడం కథాంశంగా నటులు కళ్యాణి, అభినృత్య, కిరీటిరాజ్, చరణ్, పవన్, వరలక్ష్మి, కృష్ణ తదితరుల అద్భుత నటనాచాతుర్యంతో గొల్లరామవ్వ నాటకం, అనంతరం కాళోజీ జీవిత చరిత్ర నాటకం ప్రదర్శింపబడి ఆహుతులను మంత్రముగ్ధులను చేశాయి.


వార్త VAARTHA CLASSIFIEDS — CLASSIFIEDS — వార్త VAARTHA CLASSIFIEDS

RECRUITMENT

★ WANTED ACADEMIC INCHARGE For Primary School, High School Mathematics And Science Teachers With Good Qualification For Matrusri E&L School (SSC BOARD) At Nallakunta. Very Good Salaries As Per Market Standards. (Negotiable) Contact: 9949052606/ 7331129454. Please CONTACT IMMEDIATELY.

(Ro.No. 11269)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.


## న్యాయవాదుల సంక్షేమం కోసం కృషి చేసిన మహనీయుడు



మందడి సుధాకర్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

ధర్నాచౌక్, జూన్ 10, ప్రభాతవార్త: న్యాయవాదుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేసిన మహనీయుడు మందడి సుధాకర్‌రెడ్డి అని పలువురు ప్రముఖులు కొనియాడారు. శనివారం తెలంగాణ సీనియర్ న్యాయవాది, రంగారెడ్డి, నాంపల్లి క్రిమినల్ కోర్టు ఫౌండర్ ప్రెసిడెంట్, మొట్టమొదటి టీఆర్ఎస్ లీగల్‌సెల్ గౌరవాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర ఉత్తమ న్యాయవాది గ్రహీత మందడి సుధాకర్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా పలువురు న్యాయవాదులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు సుధాకర్‌రెడ్డి చేసిన సేవలు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ నియంత్రణ మండలి ఛైర్మన్ శ్రీరంగరావు, న్యాయవాదులు ఎం.రాజేందర్‌రెడ్డి, జి.పి.రాజేశ్వరరావు, బార్ కౌన్సిల్ మెంబర్ మధుసూదన్, పంచాయితీరాజ్ ట్రిబ్యునల్ సభ్యులు పులిగారిగోవర్ధన్‌రెడ్డి, ఫుడ్ కమీషన్ మెంబర్ కొంతం గోవర్ధన్‌రెడ్డి, రవికుమార్, అనిల్‌కుమార్, అరవింద్‌కుమార్, వివిధ జిల్లాల నుండి వచ్చిన బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ పాల్గొన్నారు.

## ప్రజాగర్జన వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు విడుదల చేస్తున్న పాలబిందెల శ్రీనివాస్ తదితరులు

నిజాంపేట, జూన్ 10 ప్రభాతవార్త : ఈనెల 11న కొత్తగూడేంలో నిర్వహించనున్న సిపిఐ ప్రజాగర్జన బహిరంగ సభకు సంబంధించిన గోడపత్రికలను సిపిఐ మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ శనివారం నిజాంపేటలో విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, ప్రజా, రైతు, విద్యార్థులు, మహిళల వ్యతిరేక విధానాలకు ఎండకట్టడానికే ప్రజాగర్జన బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి నుండి పెద్దసంఖ్యలో సభకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బాగ్యమ్మ, నర్సమ్మ, యాదమ్మ, లక్ష్మీ, నాగమణి, పుష్పమ్మ, అమృతమ్మ, పద్మమ్మ, మహేష్, రాజు, కృష్ణ పాల్గొన్నారు.

## ప్రాచీన కట్టడాలను కాపాడాలి: మంత్రి సబితా ఇంద్రారెడ్డి



పునర్నిర్మించిన చారిత్రక మీర్‌పేట్ బురుజును ప్రారంభిస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

సరూర్‌నగర్, జూన్ 10 ప్రభాతవార్త: భావితరాల వారి కోసం ప్రాచీన కట్టడాలను కాపాడాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్‌లోని పాత గ్రామంలో పునర్నిర్మించిన చారిత్రక బురుజును ఆమె ప్రారంభించారు. దాదాపు రెండు శతాబ్దాల నాటిదైన మీర్‌పేట్ బురుజు శిథిలావస్థలో ఉండడంతో మంత్రి ప్రత్యేక చొరవ తీసుకొని సుందరంగా పునర్నిర్మించారు. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె బురుజు మైసమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బురుజును ప్రారంభించి గ్రామ ప్రజలకు అంకితం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో చారిత్రక కట్టడాలు, ప్రాచీన ఆలయాల అభివృద్ధికి సిఎం కెసిఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ ముదావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, స్థానిక కార్పొరేటర్ తీగల మాధవి సాయినాథ్‌రెడ్డితో పాటు పలువురు కార్పొరేటర్లు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పండ్ల వాహనాల తొలగింపు ట్రాఫిక్ ఇబ్బందికి చెక్



జిహెచ్ఎంసి కార్మికులతో శుభ్రం చేయిస్తున్న తోట మహేష్‌యాదవ్

ఎల్.బి.నగర్, జూన్ 10 ప్రభాతవార్త : ఇబ్బందిగా మారిన పండ్ల వాహనాలను ఎట్టకేలకు తొలగింప చేశారు. గడ్డి అన్నారం పండ్ల మార్కెట్ తరలింపుతో పండ్ల వ్యాపారస్తులు పలు వాహనాలతో ప్రభాత్‌నగర్ కాలనీలో తిష్ట వేసి వ్యాపారం చేస్తున్నారు. దీంతో చాలాకాలంగా ప్రభాత్‌నగర్ కాలనీలోని పరిస్థితి దయనీయంగా మారింది. రోడ్లపైనే పండ్ల వాహనాలు ఏర్పాటు చేసి వ్యాపారం చేస్తుండగా చాలా రోజులుగా ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీంతో చైతన్యపురి డివిజన్ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తోట మహేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సూచన మేరకు ఎల్బీనగర్ ట్రాఫిక్ పోలీసులతో శనివారం పండ్ల వాహనాలను తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి మహిళా అధ్యక్షురాలు నాగలక్ష్మి, జయశ్రీ, రమణారెడ్డి, సుభాష్, గట్టు శ్రీనివాస్, విజయ్‌కుమార్, సుధాకర్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## బట్టివిక్రమార్క పాదయాత్రకు మంచి స్పందన: లోకేష్ యాదవ్



మాట్లాడుతున్న నాయకులు లోకేష్ యాదవ్

తార్నాక, జూన్ 10 ప్రభాతవార్త: సీఎల్పీ నేత బట్టివిక్రమార్క పాదయాత్రకు మంచి స్పందన వస్తుందని విద్యార్థి నేత లోకేష్ యాదవ్ పేర్కొన్నారు. బట్టివిక్రమార్క నల్గొండ జిల్లా దేవరకొండలో వేయికిలో మీటర్లు పాద యాత్ర పూర్తి చేసుకున్న సందర్భంగా ఓ.యూలో శనివారం లోకేష్ యాదవ్ ఆధ్వర్యంలో సంబురాలు జరిపారు. ఆయనకు సంఘీభావంగా టపాసులు కాల్చి వేడుక చేసుకున్నారు. ఈ సందర్భంగా లోకేష్ యాదవ్, విజయ్ మాట్లాడుతూ బట్టివిక్రమార్క పాదయాత్రకు ప్రజల నుంచి మంచిస్పందన వస్తుందని సమస్యలపై ఫిర్యాదు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజాసమస్యలను బీఆర్ఎస్ గాలికి వదిలిపెడుతుందన్నారు. సీఎం కేసీఆర్ కుటుంబ పాలన నుంచి తెలంగాణకు విముక్తి చేయడమే ధ్యేయంగా బట్టి విక్రమార్క పాదయాత్ర చేస్తున్నారని ఆయన యాత్రకు తాము సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని చెప్పారు. నాయకులు గడ్డం శ్రీరాం, చనగాని దయాకర్ పాల్గొన్నారు.

### పాఠశాలను ప్రారంభించిన మేయర్

నిజాంపేట, జూన్ 10 ప్రభాతవార్త : నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన సంస్కృతి గ్లోబల్ ప్రీ పాఠశాలను మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా పాఠశాల నిర్వాహకులకు మేయర్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ విజయలక్ష్మీసుబ్బారావు, ప్రిన్సిపాల్ సరితకిషన్, డైరెక్టర్ కిషన్, మహేష్, నాగరాజు, రఘు, డివిజన్ ప్రెసిడెంట్ స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

### వార్షిక ఆదాయ ధృవీకరణ పత్రాలు సత్వరమే జారీ చేయాలి: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కృష్ణమాచారి

సైదాబాద్, జూన్ 10 ప్రభాతవార్త: కులవృత్తులు, చేతి వృత్తి దారులకు ప్రభుత్వం ఒక లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని ఇవ్వాలని నిర్ణయించిన నేపథ్యంలో అందుకు అవసరమైన వార్షిక ఆదాయ ధృవీకరణ పత్రాలను దరఖాస్తు దారులకు సత్వరమే జారీ చేయాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సంబంధిత ఎమ్మార్వోలకు సూచించినట్లు తెలంగాణా రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ మనుమయ సంఘం అధ్యక్షుడు సుంకోజు కృష్ణమాచారి తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సమయంలో వార్షిక ఆదాయ ధృవీకరణ పత్రం వివరాలు కూడా నమోదు చేయాల్సి ఉంటుందని, అయితే వార్షిక ఆదాయ ధృవీకరణ పత్రం కోసం ఎమ్మార్వో కార్యాలయంలో దరఖాస్తు చేస్తే వారం రోజుల సమయం పడుతుందని అధికారులు పేర్కొంటున్నారని, ఈ సమస్య గురించి ఎమ్మెల్యేకు తెలియజేయడంతో ఆయన వెంటనే స్పందించి ధృవీకరణ పత్రాలను వెంటనే జారీ చేయాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని కృష్ణమాచారి తెలిపారు.

### జాతీయ లోక్‌అదాలత్‌లో 51 కేసుల పరిష్కారం

చిక్కడపల్లి, జూన్ 10 ప్రభాతవార్త: చిక్కడపల్లి పోలీసుస్టేషన్‌కు సంబంధించిన 51 కేసులు శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ ద్వారా పరిష్కారం అయ్యాయి. ఈ కేసులలో ఇరుపక్షాలుమధ్య రాజీ కుదిరింది. ఈ సందర్భంగా చిక్కడపల్లి పోలీసుస్టేషన్ సిఐ ఎన్.సంజయ్‌కుమార్ కేసు వివరాలు లోక్‌అదాలత్‌లో న్యాయమూర్తి ముందు ప్రస్తావించగా పై విధంగా కేసులు పరిష్కారం అయ్యాయి.

## 4వ వార్డులోని నాలా సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం

కంటోన్మెంట్, జూన్ 10 ప్రభాతవార్త: కంటోన్మెంట్ 4వ వార్డులోని ఎల్ఐసీ కాలనీ భాస్కర్ రావ్ గార్డెన్‌లలో నెలకొన్న నాలా సమస్యను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తామని మాజీ కార్పొరేటర్ లాస్య నందిత హామీ ఇచ్చారు. శనివారం 4వ వార్డులోని ఎల్ఐసి కాలనీ అధ్యక్షుడు దుబ్బాక కిషన్‌రావ్, ప్రతినిధి అనుప్ కడియాల్‌ల ఆధ్వర్యంలో లాస్యను కలిసి వినతిపత్రం అందజేశారు. నాలాకు అనుకొని ఉన్న ఆర్టీసికి చెందిన ప్రహరీగోడను తొలగించి రెండు గజాల స్థలాన్ని నాలాలను వెడల్పు చేస్తే వరద నీరు సాఫీగా పోతాయన్నారు. అదే విధంగా నాలాకు ఇరువైపుల రిటైనింగ్ వాల్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కంటోన్మెంట్ బోర్డు సిఈఓ ఆర్టీసి ఉన్నతాధికారులతో చర్చించి నాలాను వెడల్పు చేసి రిటైనింగ్ వాల్, స్లాబ్ ఏర్పాటు చేసి వరద నీరు సాఫీగా పోయేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో 4వ వార్డుకు చెందిన బిఆర్ఎస్ నేత పరసన సంతోష్, సంతోష్ గౌడ్, సదానంద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


IN THE COURT OF THE HON'BLE PRL. DISTRICT JUDGE : R.R. DISTRICT : AT L.B.NAGAR : G.W.O.P.NO. 35 OF 2023

Between:
P.Kalpana & others .....Petitioners
AND
All concerned ....Defendants
To
All concerned

Please take notice that the Petitioners herein have filed a Original Petition TO GRANT PERMISSOIN TO ALIENATE THE PETITION SCHEDULE PROPERTIES, WHICH STANDS IN THE NAMES OF MINORS POTTI LOKESH AND POTTI UDAY vide G.W.O.P.No.35/2023, on the file on the Hon'ble Prl. District Judge, R.R.District, at L.B.Nagar and the same is posted on 14-6-2023 for the objections if any. As such, any person or persons have any sort of objection in respect of said claim of the petitioners may approach the Hon'ble Court at 10-30 A.M., oin the above said date, otherwise, Court will pass apprpriate orders based on the materials available on record.

// BY ORDERS OF COURT//
A.SRINIVAS KUMAR, Advocate
# Sagar Road, Opp : Market Yard, Ibrahimpatnam, R.R.District.
Cell : +91 9948772999.

PUBLIC NOTICE

General Public are hereby informed that my client **Sri. Joginapally Venkata Ramana Rao** S/o. Joginapally Rajeshwar Rao, Residing at Plot No.36, Karkhana, H.A.C.P. Colony, Vikrampauri, Tirumalagiri, Manovikasnagar, Hyderabad-09 Lost Original Document bearing No. 15209/1987 dated 12-12-1987 before at S.R.O. Hayathnagar in respect of Plot bearing No.122 in Sy.No.132, adm. 460 Sq.Yards, Situated at Aanmagal, (AAmangal) Hayathnagar, R. R. District, and also link document No. 7059/1984 dated 04-07-1984 at S.R.O. Hyderabad which is in the name of SMT. J. NIRMALA DEVI mother of my client. All efforts of my client to trace the document but in vain. I request the General public, to handover the same said original documents either to me or my client if anybody found it. I also warn in general that if anybody misuses the said original document, they will be prosecuted/ punished under the law of land and my client will not be held responsible for any transactions that are done by miscreant and will not be binding onhim.

K.V. KONDAL RAO
ADVOCATE
Sudharshan Enclave, Alakapuri Colony, SRK Puram, Hyderabad-500035.
Cell No. 8374232138.

IN THE COURT OF THE HON'BLE I ADDL. JUNIOR CIVIL JUDGE-cum-V ADDL. METROPOLITAN, MAGISTRATE MEDCHAL-MALKAJGIRI DISTRICT AT L.B.NAGAR
O.S.NO. 285 OF 2023

Between:
**Smt. Mannem Sabitha & others** ...PLAINTIFFS
AND
**P. Jithender Reddy & others** ...DEFENDANTS
To
**All concerned ...DEFENDANT NO.3**

NOTICE

That the above named Plaintiffs filed the above suit for Declaration to declare them as legal heirs of deceased **Mannem Sathi Reddy** S/o Late M. Narayana Reddy who died intestate on 18-01-2023 by leaving behind the Plaintiffs as his legal heirs and successors to succeed her estate against you and others and the said suit is posted on 10-07-2023 for objections. If any person or persons is/are having any objections he/she/they may appear before the Hon'ble Court on 10-07-2023 at 10:30 A.M. either in person or through an Advocate, failing which the matter will be decided as per law in your absence.

SCHEDULE OF PROPERTY

All that the House bearing Old H.No. 2-43/A, (New H.No.2-144/2) constructed on Plot No.2, in Sy.No.716, admeasuring 112.5 sq.yards or 94.0 sq.meters, situated at Hanumasai Nagar, Uppal village and Mandal, Medchal-Malkajgiri District, Telangana State and bounded by: North: House of Tulasi Bai, South: Plot No.3, East: Neighbour's House, West: 50' wide Road.

(BY ORDER OF THE COURT)
M. SHIVA SHANKER
N. NARESH KUMAR
Advocates,
Hastinapuram, Hyderabad
COUNSEL FOR THE PLAINTIFFS
Phone No.9440725458

BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-II, 1ST FLOOR, TRIVENI COMPLEX, ABIDS, HYDERABAD-500001.
O. A. No. 92 OF 2023
SUMMONS UNDER SUB-SECTION (4) OF SECTION 19 OF THE ACT, READ WITH SUB-RULE (2A) OF RULE 5 OF THE DEBT RECOVERY TRIBUNAL (PROCEDURE) RULES 1993.

BETWEEN:
State Bank of India, SME Centre, Main Branch, at Patny Circle, Secunderabad. Represented by its Chief Manager. ...Applicant
AND
1. M/s. Dhruvika Industries, Represented by its proprietor, Rallabandi Umarani, Plot No.367, Survey No.229 to 246, B.N.Reddy Colony, Phase-II, Cherlapally, Medchal-Malkajgiri Dist -051. Secunderabad-500040.
2. Smt.Rallabandi Umarani, W/o. R.Amarender, Aged 32 years Occ: Proprietor of M/s. Dhruvika Industries, address : Plot No.18, Road No.20, Indiranagar, Phase-2, Moula-ali, Medchal-Malkajgiri Dist H.B.Colony. ... Defendants.

SUMMONS / SUBSTITUTED SERVICE BY WAY OF PAPER PUBLICATION

Whereas O.A .No. 92 of 2023 is listed before the Presiding officer/ Registrar on 11-07-2023. (Date of filing 14-12-2022. Last date of hearing 24-05-2023)
Whereas the Hon'ble Tribunal is pleased to issue summons/notice on the said Application under Section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of Rs.26,39,742/-. (Rupees Twenty Six Lakhs & Thirty Nine Thousand & Seven Hundred Forty Two Only).
In accordance with Sub-section (4) of Section 19 of the Act, you, the defendants are directed as under:
(I) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted.
(II) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application.
(III) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties.
(IV) You shall not transfer by way of sale, lease, or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and / or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal.
(V) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the Bank or Financial Institutions holding security interest over such assets.
You are also directed to file the Written Statement with a copy thereof furnished to the applicant to appear before Registrar on 11-07-2023 at 10.30 A.M. failing which the application shall be heard and decided in your absence.
Given under my hand and the seal of this Tribunal on this th day of 1st June, 2023.
// By Order of the Tribunal//
Sd/- REGISTRAR
Debts Recovery Tribunal-II
1ST floor, Triveni Complex, Abids, Hyderabad- 500001.

BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-II. 1ST FLOOR, TRIVENI COMPLEX, ABIDS, HYDERABAD-500001.
O. A. No. 230 OF 2023
SUMMONS UNDER SUB-SECTION (4) OF SECTION 19 OF THE ACT, READ WITH SUB-RULE (2A) OF RULE 5 OF THE DEBT RECOVERY TRIBUNAL (PROCEDURE) RULES 1993.

BETWEEN:
State Bank of India, SME Centre, Main Branch, at Patny Circle, Secunderabad. Represented by its Chief Manager. ...Applicant
AND
1. M/s. Desa Foods, Represented by it Proprietor Smt.. Banoth.Saritha, Gayatri Towers, 8-3-191/64, A-60, MIGH, Vengal Rao Nagar, Hyderabad-038.
2. Smt. Banoth. Saritha W/o.B.Devender Kumar aged 29 years Occ: Business R/o. Flat No.SHT 1020, Sanath Nagar, Ameerpet, Hyderabad-500 018. ...Defendants

SUMMONS / SUBSTITUTED SERVICE BY WAY OF PAPER PUBLICATION

Whereas O.A .No. 230 of 2023 is listed before the Presiding officer / Registrar on 11-07-2023. (Filing date 19-01-2023 Last date of filing 24-05-2023)
Whereas the Hon'ble Tribunal is pleased to issue summons/notice on the said Application under Section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of Rs.39,68,665/- (Rupees Thirty Nine Lakhs Sixty Eight Thousand Six Hundred & Sixty Five Only).
In accordance with Sub-section (4) of Section 19 of the Act, you, the defendants are directed as under:
(I) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted.
(II) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application.
(III) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties.
(IV) You shall not transfer by way of sale, lease, or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and / or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal.
(V) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the Bank or Financial Institutions holding security interest over such assets.
You are also directed to file the Written Statement with a copy thereof furnished to the applicant to appear before Registrar on 11-07-2023 at 10.30 A.M. failing which the application shall be heard and decided in your absence.
Given under my hand and the seal of this Tribunal on this I th day of 1st June, 2023.
// By Order of the Tribunal//
Sd/- REGISTRAR
Debts Recovery Tribunal-II
1ST floor, Triveni Complex, Abids, Hyderabad- 500001.
Ameerpet, Hyderabad-500 018.

# ప్రజలకు మేలు జరిగేలా పని చేయాలి : కలెక్టర్ నారాయణ రెడ్డి

ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :
పరిపాలనలో వచ్చిన మార్పులతో ప్రజలకు మేలు జరిగేలా పని చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్ర అవతరణ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సూపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ముందుగా రాష్ట్ర బిసి కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్,జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బైండ్ల విజయకుమార్,గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుశీల్ కుమార్ గౌడ్,అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ,అడిషనల్ ఎస్పీ మురళీధర్,డిఆర్ఓ అశోక్ కుమార్,జిల్లా అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన గావించారు.సభా కార్యక్రమాన్ని వందేమాతర గీతంలో మొదలుపెట్టారు. కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యఅతిథి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ.....ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రజలకు చేరేలా పని చేసినట్లుయితే ఫలితాలు వస్తాయన్నారు.ప్రజలు ప్రజాప్రతినిధులు ,అధికారులు కలిసి పనిచేయడం వల్ల సుపరిపాలన సాధ్యమవుతుందని కలెక్టర్ అన్నారు. శాఖల్లో స్పష్టమైన మార్పులతో రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తూ ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు.ప్రభుత్వం పరిపాలనలో ఎన్నో సంస్కరణలు తీసు




కువచ్చి పాలన ప్రజల చెంతకే రావడం జరుగుతుందని అని కలెక్టర్ అన్నారు. పరిపాలన సంస్కరణలో ప్రక్షాళన చేస్తూ ప్రజలకు పరిపాలన సౌలభ్యంగా ఉండే విధంగా జిల్లాలను,మండలాలలను నూతన ఏర్పాటు చేసుకోవడం జరిగిందని తెలంగాణ రాష్ట్ర ఏర్పడ్డాక వికారాబాద్ జిల్లాను ఏర్పాటు చేసుకొని రెండు రెవెన్యూ డివిజన్లను,రెండు మున్సిపాలిటీలు ఉన్న వాటిని నాలు మున్సిపాలిటీగా ఏర్పాటు చేసుకోవడం జరిగిందని తెలిపారు.జిల్లాలో 17 మండలాలు ఉండగా నూతనంగా మూడు మండలాలను ఏర్పాటు చేసుకొని పరిపాలన సౌలభ్యాన్ని కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు.రాష్ట్రం ఏర్పాడ్డక శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా మన రక్షణ కొరకు పోలీస్ వ్యవస్థ పని చేస్తుందని నమ్మకాన్ని కల్పిస్తూ ఫ్రెండ్లీ పోలీస్ విధానాన్ని ప్రవేశపెట్టి నూతనంగా పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు.మహిళల రక్షణ కొరకు షీ టీంల ఏర్పాటు ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా ప్రజలకు పోలీసు యంత్రాంగం అవగాహన కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని గుర్తు చేశారు. అనంతరం బిసి కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్,జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బైండ్ల విజయకుమార్,అదనపు కలెక్టర్ రాహుల్ శర్మలు కూడా పరిపాలన గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ జానకి రెడ్డి,మిషన్ భగిరథ ఎస్ఈ ఆంజనేయులు,నీటిపారుదల శాఖ ఇఇ హెప్సినాథ్,వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ ,పంచాయతీ శాఖ అధికారి తరుణ్ కుమార్,టిఎస్ఎస్పీడిసిఎల్ జయరాజ్, పోలీస్ శాఖ అడిషనల్ ఎస్పీ మురళీధర్,,జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుశీల్ కుమా ర్‌గౌడ్ ,వికారాబాద్ ,తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్‌లు చిగుళ్లపల్లి మంజుల రమేష్, స్వప్న పరిమళ్‌లతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## పైప్‌లైన్ లీకేజీ...వృధాగా పోతున్న మంచినీరు

-నాలుగు నెలల క్రితం లీకేజి
-పట్టించుకొని సర్పంచ్,పంచాయతీ కార్యదర్శి



మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ వృధాగా పారుతున్న నీళ్లు

ధారుర్ జూన్10,ప్రభాతవార్త :
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ నీరు వృధాగా పోతుంటే అధికారులు పట్టించుకోవడం లేదు.ధారుర్ మండల పరిధిలోని అల్లపూర్ గ్రామంలో మసీదు సమీపంలో రోడ్డుపై మిషన్ భగీరథ పైపు లైన్ లీకేజ్ కావడంతో రోడ్డుపై వృధాగా నీళ్లు పారుతున్నాయి.రోడ్డుపై వాహనాలు నడవడంతో లీకేజీ వద్ద గుంతల ఏర్పడి మురికి నీళ్లు తిరిగి పైప్‌లైన్‌లో వెళ్లడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఎన్నిసార్లు సర్పంచ్,పంచాయతీ కార్యదర్శికు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ప్రజలు చెబుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి లీకేజీ అయిన పైపులైన్‌ను మరమ్మతులు చేసి,ప్రజలు రోగాల బారిన పడకుండా చూడాలని కోరుతున్నారు.

## ఎమ్మెల్యే దృష్టికి సమస్య..వెంటనే పరిష్కారం

-ఎమ్మెల్యేకు రాంపూర్ గ్రామ ప్రజలు కృతజ్ఞతలు

ధారుర్ జూన్10,ప్రభాతవార్త :
ధారూర్ మండల పరిధిలోని రాంపూర్ గ్రామ ప్రజలు ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ దృష్టికి కరెంటు సమస్యలు తీసుకొచ్చారు.ఎమ్మెల్యే స్పందించి వెంటనే విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి,రాంపూర్ గ్రామ పంట పొలాలలో వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని ,అవసరమైన చోట నూతన స్తంభాలు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.ఎమ్మెల్యే ఆదేశాలతో విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పూర్తి చేశారు.రాంపూర్ గ్రామ ప్రజలు, రైతులు ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ మెతుకు ఆనంద్ మాట్లాడుతూ.... గ్రామాల్లో ఏ సమస్య ఉందని తమ దృష్టికి తీసుకురావాలని ,తను ప్రజల మనిషినని తెలిపారు.ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని అన్నారు.

## గట్టమైసమ్మ దేవాలయానికి మాజీ ఎంపిపి పద్మాజగన్‌రెడ్డి విరాళం



విరాళాన్ని అందజేస్తున్న మాజీ ఎంపిపి పద్మాజగన్‌రెడ్డి

మేడ్చల్, జూన్ 10. ప్రభాతవార్త ః
ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తున్నామని మేడ్చల్ మాజీ ఎంపిపి పద్మాజగన్‌రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటిలోని సుతారిగూడలో నూతనంగా నిర్మించిన కట్టమైసమ్మ ఆలయానికి మాజీ ఎంపిపి రూ. 50 వేల విరాళాన్ని శనివారం ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి దంపతులను సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఆలయాలు వెలువడం శుభ పరినామమని, ఆలయాలతో గ్రామాలు భక్తిభావంతో శోభిల్లుతాయని అన్నారు. తన వంతు సహకారంగా ఆలయానికి విరాళం అందజేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు రజితా వెంకటేష్, పెంటయ్య, గౌడవెల్లి గ్రామ మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి,మాజీ ఉప సర్పంచ్ వెంకటేష్ పాల్గొన్నారు.

## గ్రామీణ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి



షాబాద్‌లో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మధుసూదన్‌రెడ్డి

షాబాద్, జూన్ 10, ప్రభాతవార్త :
గ్రామీణ ప్రాంత క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. షాబాద ప్రీమియర్ లీగ్ 2 క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం పీఆర్‌ఆర్ మినీ స్టేడియంలో ఆయన పోటీలు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మారుమూల గ్రామాల్లోని యువత క్రీడల్లో రాణించేందుకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. గ్రామీణ యువకులు క్రీడల్లో రాణించి మండలానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. క్రీడాకారులకు మావంతు సహాయసహకారాలు ఎప్పుడు ఉంటాయన్నారు. ఈ క్రీడల్లో మంచి ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు క్రికెట్ మొదటి బహుమతి రూ.50వేలు, రెండవ బహుమతి రూ.30వేలు, మూడవ బహుమతి రూ.20వేల నగదుతో పాటు బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రీడల్లో మొత్తం 8జట్లు తలపడనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కావలి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి శ్రీరాంరెడ్డి, ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, జయమ్మవెంకట్‌రెడ్డి, గుండాల ఆశోక్, నాయకులు తమ్మలి రవీందర్, దేశమోళ్ల ఆంజనేయులు దండు రాహుల్‌గుప్తా, శేఖర్, ఆశ్వక్ అలీ, ఖుద్దూస్, నర్సింలు, రవీందర్‌నాయక్, చంద్రయ్య, అత్తెల్లి శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, జంగయ్య, శ్రీనివాస్, క్రీడాకారులు తదితరులు ఉన్నారు.

## గ్రూప్ 1 పరీక్షా కేంద్రాల వద్ద భద్రత కట్టుదిట్టం

**మొయినాబాద్, జూన్ 10 ప్రభాతవార్త:** గ్రూప్ 1 పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని రాజేంద్రనగర్ అదనపు డిసిపి రష్మీ పరిమల ఆదేశించారు. మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 11 ఆదివారం జరుగనున్న టిఎస్‌పిఎస్‌సి గ్రూప్ 1 పరీక్షా కేంద్రాలను రాజేంద్రనగర్ అదనపు డిసిపి రష్మీ పరిమల్, చేవెళ్ల ఏసిపి ప్రభాకర్‌తో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద చేపట్టాల్సిన భద్రత చర్యలు గురించి సలహాలు, సూచనలు చేశారు. గ్రూప్ వన్ పరీక్షా కేంద్రాల వద్ద 50 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్లోబల్ కాలేజ్, జెబిఐటి, టిఎస్‌డబ్ల్యుఎస్ జూనియర్ కాలేజీ చిలుకూరు, జడ్‌పి హెచ్‌ఎస్ అజిత్ నగర్, ఛాలెంజర్ స్కూల్ మొయినాబాద్, సిద్ధార్థ జూనియర్ కాలేజీ, భరతజ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో మొత్తం 3552 మంది అభ్యర్థులు పరీక్షలు రాస్తున్నారు.



గ్రూప్ 1 పరీక్షా కేంద్రాలను సందర్శించిన రాజేంద్రనగర్ అదనపు డిసిపి రష్మీ పరిమల్, చేవెళ్ల ఏసిపి

# ప్రజల సమస్యలు తీర్చేందుకు పల్లెబాట

-పరిగి ఎమ్మెల్యే మహేష్ రెడ్డి
-పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
-పల్లెబాటలో భాగంగా 8 గ్రామాలు పర్యటన

చౌడాపూర్ జూన్10,ప్రభాతవార్త :
పరిగి నియోజకవర్గం ఎమ్మెల్యే మహేష్ రెడ్డి చేపట్టిన పల్లెబాట కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుంది.మండలంలోని 8 గ్రామ పంచాయతీలలో పల్లెబాటలో భాగంగా పర్యటించి.గ్రామ ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టారు.మండల పరిధిలోని చిన్న మేఘ్య తండా,నీర్సాప్ తండా,చాకలిపల్లి, మొగుళ్లపల్లి,కిష్టంపల్లి,బంగ్రంపల్లి,మరికల్ కన్మన్కల్వ గ్రామాలలో పర్యటించారు. శనివారం ఉదయం మండల పరిధిలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సుపరిపాలన కార్యక్రమ సమావేశంలో ఎమ్మెల్యే మహేష్ రెడ్డి పాల్గొని,తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత అమలు అవుతున్న సంక్షేమ పథకాలు,భూమి రిజిస్ట్రేషన్ విషయంలో ధరణిపాత్రం గురించి వివరించారు.కొత్త రాష్ట్రం ఏర్పరచుకున్న తర్వాతే చౌడపూర్ మండల కేంద్రాన్ని సాధించగలిగామని ఎమ్మెల్యే మహేష్ రెడ్డి పేర్కొన్నారు.అనంతరం పల్లెబాలలో గ్రామ గ్రామాన సమావేశాలు నిర్వహించి,ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు,గ్రామానికి వస్తున్న నిధులు గురించి వివరించి రాబోయే పథకాల గురించి కూడా ప్రజలకు వివరిస్తూ,



ప్రజల సమస్యలను తెలుసుకొని గ్రామానికి కావాల్సిన పనులను అతి త్వరలో పూర్తి చేస్తానని తెలిపారు.వివిధ గ్రామాలలో కొత్తగా నిర్మించిన పంచాయతీ కార్యాలయాలను మరియు కొన్ని లక్షల వ్యయంతో పలు సిసి రోడ్లు,బిటి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.మండలంలో రెండో రోజు కూడా పల్లెబాట కొనసాగుతుందని తెలిపారు.ఈకార్యక్రమంలో జడ్పిటిసి రాందాసు,ఎంపిపి సత్యహరిచంద్ర,పిఎసిఎస్ వైస్ చైర్మన్ నాగరాజు,నాయకులు పాండురంగయ్య,మతం,రాజశేఖర్,వెంకట్,శ్రీకాంత్ రెడ్డి,మేఘ్య ,అశోక్,నరసింహ,గ్రామాల సర్పంచ్‌లు,ఎంపిటిసిలు,బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌కు తెలంగాణ ఉద్యమకారుడు రాంచందర్‌యాదవ్ రాజీనామా



తూంకుంటలోని మొగుళ్ల రామకృష్ణరెడ్డి పంక్షన్‌హాల్‌లో ఉమ్మడి మండల బిఆర్ఎస్ నాయకులు చిర్రబోయిన రాంచందర్‌యాదవ్ విలేకరులతో మాట్లాడుతున్న దృశ్యం

శామీర్‌పేట, జూన్ 10, ప్రభాతవార్త
తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, శామీర్‌పేట ఉమ్మడి మండల బిఆర్ఎస్ సీనియర్ నాయకులు చిర్రబోయిన రాంచందర్‌యాదవ్ (తూంకుంట) బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. త్వరలోనే పెద్ద ఎత్తున ర్యాలీతో వెళ్లి బహిరంగసభలో కాంగ్రెస్ పార్టీలో అభిమానులు,అనుచరులతో చేరనున్నట్లు ఆయన ప్రకటించారు. శనివారం ఈ విషయంపై శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీలోని మొగుళ్ల రామకృష్ణరెడ్డి పంక్షన్‌హాల్‌లో రాంచందర్‌యాదవ్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగ తెలంగాణ ఉద్యమకారుడు, శామీర్‌పేట ఉమ్మడి మండల బిఆర్ఎస్‌నాయకులు చిర్రబోయిన రాంచందర్‌యాదవ్ మాట్లాడుతూ బిఆర్ఎస్‌కు రాజీనామా చేసినట్లు రాజీనామా పత్రాలను తెలంగాణ బిఆర్ఎస్ భవన్‌కు, జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు,ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు, తూంకుంట మున్సిపల్ చైర్మన్ కె.రాజేశ్వర్‌రావుకు, తూంకుంట మున్సిపాల్టీ బిఆర్ఎస్ అధ్యక్షులు ఎన్.శ్రీనివాస్‌రెడ్డికి పంపటం జరుగుతుందని అన్నారు. బిఆర్ఎస్‌లో తెలంగాణ ఉద్యమకారులను అణగదొక్కటంతో పాటు బిసి,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీలను ఎదగకుండ చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి అగ్రవర్గానికి (రెడ్డిలకు) ప్రాధాన్యత ఇస్తున్నారని, వారికే పదవులు కట్టబెడుతున్నారని విమర్శించారు. 2001సంవత్సరంలో జలదృశ్యంలో ఏర్పడిన టిఆర్ఎస్ పార్టీ నాటి నుంచి సిఎం కెసిఆర్ వెంటనే టిఆర్ఎస్‌లో తెలంగాణ సాధన కోసం ఉద్యమంలో పనిచేశానని, ఎన్నికలు వచ్చినా టిఆర్ఎస్ విజయం కోసం ఆహోర్నిశలు పనిచేసినట్లు తెలిపారు. సిఎం కెసిఆర్ మీద మంచి అభిప్రాయం ఉందని, అయితే మంత్రి మల్లారెడ్డి వచ్చిన తరువాతనే అగ్రవర్ణాల వారికే ప్రాధాన్యత ఇస్తున్నారని, రెడ్డిలకే పార్టీ పదవులు కట్టబెడుతున్నారని, బిసిలకు గుర్తింపును ఇవ్వటం లేదని,అణగదొక్కుతున్నారని రాంచందర్‌యాదవ్ ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్యశాఖల మంత్రి టి.హరీశ్‌రావుకు తాను సన్నిహితంగ ఉంటూ పార్టీ కోసం కూడ పనిచేశానని, మంత్రి హరీశ్‌రావు సహకారంతో ఈ ప్రాంతంలో పలువురు పేదలకు సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు సుమారు 80లక్షల వరకు తాను బిఆర్ఎస్ నాయకునిగ ప్రజల్లో ఉంటూ సేవాదృక్పథంతో ఇప్పించటం జరిగిందన్నారు. ప్రస్తుతం బిఆర్ఎస్ పార్టీ ఉద్యమపార్టీ కాదని, బిఆర్ఎస్ ద్రోహుల పార్టీగ మారిందని ఆయన విమర్శించారు. మంత్రి మల్లారెడ్డి ఏకపక్ష నిర్ణయాలతోనే విసుగుచెంది తాను బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలంగాణ ఉద్యమకారుడు,బిఆర్ఎస్ సీనియర్ నాయకులు చిర్రబోయిన రాంచందర్‌యాదవ్ పేర్కొన్నారు. ఆయనతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# అనర్హులకు ఇళ్ల పట్టాలు

-సర్పంచ్‌కు తెలియకుండానే పంపిణీ
-అధికారులు,నాయకులు కుమ్మక్కై లబ్దిదారుల ఎంపిక
-సర్పంచ్ పెద్ద కుర్వ శివలీల

పెద్దేముల్, జూన్ 10, ప్రభాతవార్త:
గ్రామంలో ఇళ్ళులేని నిరుపేదలకు గుర్తించకుండా అనర్హులకు ఇళ్ళ పట్టాలు పంపిణీ చేసారని సర్పంచ్ పెద్ద కుర్వ శివలీల ఆరోపించారు. శనివారం పెద్దేముల్ మండలం రుక్మాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆమే విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శివలీల మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నెంబర్ 17లో 16 గుంటల ప్రభుత్వ భూమిలో నిరుపేదలకు ఇళ్ళు ఇవ్వడానికి అధికారులు స్థలాన్ని సర్వే చేశారని అన్నారు. అట్టి స్థలములో ఒక్కొక్కరికి 75 గజాల స్థలాన్ని ఇవ్వడానికి అధికారులు నిర్ణయించారని అన్నారు. అందుకు నిరుపేద కుటుంబాలకు చెందిన 18 మంది జాబితాను తయారుచేసి తహసీల్దార్ కార్యాలయంలో ఇచ్చానని అన్నారు. కాని తనకు తెలియకుండాతాను పంపిన జాబితాను కాకుండా గ్రామానికి చెందిన నాయకులు, అధికారులు కుమ్మకై మరో జాబితాను తయారుచేసి అనర్హులకు ఇళ్ళ పట్టాలను పంపిణీ చేసారని అన్నారు. గ్రామ సర్పంచ్, వార్డుమెంబర్లకు తెలియకుండా లోలోపల పట్టాల పంపిణీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మహిళా సర్పంచ్ అని కూడా చూడకుండా తనను అగౌరవ పరుస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. నిజమైన అర్హులను గుర్తించకుండా, డబ్బులు తీసుకొని అనర్హులను ఎంపిక చేసారని ఆరోపించారు.అట్టి ఎంపికలో ప్రభుత్వ ఉద్యోగులు,



మాట్లాడుతున్న సర్పంచ్ శివలీల

భూస్వాములు, ఆస్థిపరులు ఉన్నారని ఆందోళన వ్యక్తంచేశారు. నిరుపేదలైన అర్హులకు ఇళ్ళ పట్టాలు ఇచ్చేంత వరకు తాను పోరాటం చేస్తానని అన్నారు. తనకు సమాచారం ఇవ్వకుండటమే కాకుండా తనను అగౌరవపరుస్తున్న తహసిల్దార్, యంపిడిఓపై ఉన్నతాదికారులు చర్యలు తీసుకోవాలని,ఇట్టి విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు పిర్యాదు చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ మానికమ్మ, గ్రామస్థులు పెద్ద రాచయ్య, వడ్ల ప్రభు, సత్యనారాయణ, ఎస్.శ్రీనివాస్, రాణెమ్మ, వెంకటయ్య, శివప్ప,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్‌లో పౌర సేవలు పారదర్శకంగా అందిస్తున్నాం: చైర్మన్

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 10, ప్రభాతవార్త:
మున్సిపల్‌లో పరిపాలన ప్రజలకు చేరువయ్యిందని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సుపరి పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బందికి చైర్మన్ శనివారం శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మున్సిపాల్ ఏర్పాటుతో ప్రజలకు పౌరసేవలు త్వరితగతిన అందుతున్నాయని అన్నారు. జనన మరణ ధృవీకరణ పత్రాలతో పాటు ఆసరా పెన్షన్‌లు,ఇంటి నిర్మాణ అనుమతులు తదితర పనులు సులభంగానే ప్రజలకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఎంతో పారదర్శకంగా, అవినీతి లేకుండా, కాలయాపన లేకుండా పౌర సేవలు అందుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, కమిషనర్ ఎ. సురేశ్, కౌన్సిలర్లు గొంగళ్ల మహేశ్ కురుమ, నర్రి ధనలక్ష్మి, చింతల రాజశేఖర్, సింగిరెడ్డి సాయిరెడ్డి, మెట్టు బాల్‌రెడ్డి, ఎన్. లక్ష్మి, మోటుపల్లి పోచమ్మ, అబ్బవతి సరిత, కోఆప్షన్ సభ్యుడు ఎండీ. అక్రం అలీ, మున్సిపల్ మేనేజర్ నర్సింహులు పాల్గొన్నారు.



తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సుపరి పాలన దినోత్సవం సందర్భంగా కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బందికి శాలువా కప్పి సత్కరించిన చైర్మన్ బి. కొండల్ రెడ్డి.

## యువత క్రీడలను ఆస్వాదించాలి



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

కొత్తూర్, జూన్ 10, ప్రభాతవార్త :
క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ఆరోగ్యానికి దోహదపడుతాయని సీపీఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు తెలిపారు. శనివారం కొత్తూర్ మున్సిపాలిటీలో వడ్డే సురేష్ జ్ఞాపకార్థంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు పాల్గొని టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, అందుకు తల్లిదండ్రులు కూడా సహకరించాలన్నారు. క్రీడల పట్ల మానసిక ఉల్లాసంతో పాటు శరీర దృఢత్వానికి దోహదపడుతుందన్నారు. క్రీడల పట్ల విద్యను అవలీలగా అభ్యసించేందుకు సులువుగా ఉంటుందన్నారు. కావున ప్రతి ఒక్కరు విద్యతో పాటు క్రీడలు ఆస్వాదించాలన్నారు. ఈకార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ స్టేట్ ప్రెసిడెంట్ కార్తీక్‌రెడ్డి, ఓం ప్రకాష్‌చారి, చరణ్‌రెడ్డి, వెంకటేష్, బిజిలి రఘు, మామిళ్ల సురేష్, పిట్ల రవి, చంటి, క్రీడాకారులు తదితరులు ఉన్నారు.

## కెసిఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

-దివ్యాంగుల హర్షం



సిఎం కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బాలరాజు

ధారుర్ జూన్10,ప్రభాతవార్త :
రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ దివ్యాంగుల సంక్షేమం కోసం నెలనెల వారికి ఇచ్చే రూ.3116 పెన్షన్‌కు మరో వెయ్యి రూపాయలు జమ చేసూనత వచ్చే నెల నుండి రూ.4116 ఇవ్వనున్నట్లు ప్రకటించడం హర్షదాయకమని ధారుర్ మండల భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు బాలరాజ్ అన్నారు.శనివారం ధారుర్ మండల కేంద్రంలోని ముఖ్యమంత్రి కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన అనంతరం బాలరాజు మాట్లాడుతూ... సిఎం కెసిఆర్ దివ్యాంగుల పాలిట దేవుడని వారు అభివర్ణించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ రుణ పడి ఉంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమౌళి,బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అంజయ్య,టౌన్ అధ్యక్షుడు యాత్ర గౌడ్,సోషల్ మిడియా ఇన్‌చార్జీ విజయ్,యువ నాయకులు మహేష్,నరిసింహులు,జానీ,మహేష్,హన్మంతు,గోవర్ధన్ ,మక్సూద్,దీవిబాయి,పాండు,అశన్న,తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

షాబాద్, జూన్ 10, ప్రభాతవార్త :
షాబాద్ జిల్లా పరిషత్ పాఠశాలో 2002-03 విద్యా సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు శనివారం మండలంలోని ఓ పంక్షన్‌హాల్‌లో 150 మంది పూర్వవిద్యార్థులు కలుసుకుని తీపి జ్ఞాపకాలు పంచుకున్నారు. 20ఏళ్ల తర్వాత చిన్నతనంలో ఏర్పడిన స్నేహబంధం ఎప్పటికి మరిచిపోనిది, విడదీయరానిదని గుర్తు చేసుకున్నారు. వ్యాపార, ఉద్యోగ, కుటుంబాల రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడినవారు ఒక్క చోటికి రావడం ఆనందానికి అవదులు లేకుండా పోయాయి. ఈ రోజు ఎంతో సంతోషంగా ఉందని పూర్వ విద్యార్థులు సందడిగా గడిపారు. ఈకార్యక్రమంలో సీఐ గురువయ్యగౌడ్, ఎస్పై మహేశ్వర్‌రెడ్డి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు నర్సింలుగౌడ్, ఉపాధ్యాయులు యాదగిరిచారి, సుధాకర్, నర్సింలు, దశరథ, కుమారస్వామి, యావ దాస్, వీరన్న, వేణుగోపాల్, కృష్ణయ్య, విజయలక్ష్మి, మేరి జయమ్మ, పూర్వ విద్యార్థులు పొనమోని వెంకటేష్‌యాదవ్, అనిల్‌గుప్తా, కుమ్మరి రాజేందర్, శ్రీనివాస్, వీరేష్‌గుప్తా, శ్రవణ్, అనిల్ తదితరులు ఉన్నారు.

## రాజ్యసభ సభ్యురాలు రంజితా రంజిస్‌కు ఘన స్వాగతం



రాజ్యసభ సభ్యురాలు రంజితారంజిస్‌కు ఘన స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 10, (ప్రభాతవార్త) :
సీఎల్పీ నేత బట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర 1000 కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పాదయాత్రకు సంఘీభావం తెలియజేయడానికి విచ్చేసిన రాజ్యసభ సభ్యురాలు రంజితా రంజిస్‌కు రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహ్మారెడ్డి ఆధ్వర్యంలో మహేశ్వర నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో దేప భాస్కర్‌రెడ్డి, కందుకూరు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కృష్ణనాయక్, రవినాయక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## అభివృద్ధి, ప్రజాసంక్షేమమే బిఆర్ఎస్ లక్ష్యం

-ఉపసర్పంచ్ బోయిని మల్లప్ప

పెద్దేముల్; జూన్ 10, ప్రభాతవార్త:
అభివృద్ధి, ప్రజాసంక్షేమమే బిఆర్ఎస్ లక్ష్యమని ఉపసర్పంచ్ బోయిని మల్లప్ప అన్నారు. శనివారం పెద్దేముల్ మండలంలోని ఖానాపూర్ పంచాయతీ కార్యలయంలో కేక్ కట్ చేసి సుపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మల్లప్ప మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం నెంబర్‌వన్ స్థానంలో ఉందని గుర్తుచేశారు. సిఎం కేసిఆర్ హయంలో నూతన గ్రామపంచాయతీలు ఏర్పడడమే కాకుండా గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయని అన్నారు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సహకారంతో తాండూరు నియోజకవర్గ రూపురేఖలు మారిపోయాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామి టీఏ అంజయ్య పాల్గొన్నారు.



ఖానాపూర్‌లో కేక్ కట్ చేసి సంబురాలు చేస్తున్న దృశ్యం